లక్షతోపాటు తులం బంగారం ఇవ్వాల్సిందే..

■ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

వినాయక్‌నగర్, మార్చి 11: అధికారంలోకి వస్తే ఆడబిడ్డల పెండ్లికి రూ.లక్ష తోపాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సోమవారం 895 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. లబ్ధిదారులకు త్వరగా చెక్కులు మంజూరయ్యేలా చూడాలన్నారు.

రేపు ఎన్‌సీఎస్‌ఎఫ్‌కు కలెక్టర్, ఎమ్మెల్యే

సారంగాపూర్, మార్చి 11 : నగర శివారులోని సహకార చక్కెర కర్మాగారాన్ని ఈనెల 13న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సందర్శించనున్నారని అఖిల భారత చెరుకు విభాగం కన్వీనర్ కొండెల సాయిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న ఫ్యాక్టరీని సందర్శించాల్సి ఉన్నప్పటికీ.. అనివార్య కారణాలతో ఈనెల 13వ తేదీకి వాయిదా పడిందని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు రైతులు, వాటాదారులు హాజరుకావాలని కోరారు.

గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు ప్రవేశపరీక్ష

డిచ్‌పల్లి, మార్చి 11 : తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల వరకు మిగిలిన సీట్ల భర్తీకి బీఎల్‌వీసెట్-2024ను వచ్చే నెల 21న ప్రవేశపరీక్ష ఉంటుందని జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారిణి అలివేలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని, తరగతులు, కులాల వారీగా ఖాళీలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వినాయక్‌నగర్, మార్చి 11 : నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. సారంగాపూర్ ఏరియాకు చెందిన కూలీ పనిచేసుకునే రాథోడ్ రామారావు (65) సోమవారం సారంగపూర్ రైస్‌మిల్లు వద్ద రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. దీంతో రామారావు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆర్మూర్ టౌన్ పోలీసులు లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి, లారీని సీజ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

రుద్రూర్, మార్చి 11 : మండలంలోని చిక్కడ్‌పల్లికి చెందిన మచ్కూరి శంకర్ (38) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు అప్పులు ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

ఆర్ఎంను కలిసిన బీసీ ఉద్యోగుల సంఘం నేతలు

ఖలీల్‌వాడి మార్చి 11 : టీఎస్ ఆర్టీసీలో మళ్లీ యూనియన్లు, సంఘాలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాకేంద్రంలో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఇటీవల ఏర్పాటైంది. రీజినల్ మేనేజర్ జానీరెడ్డిని సంఘం ప్రతినిధులు సోమవారం కలిసి పుష్పగుచ్ఛం సమర్పించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఫిట్‌మెంట్ ప్రకటించడంపై రాష్ట్రప్రభుత్వానికి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రజావాణి'కి 95 ఫిర్యాదులు

కంఠేశ్వర్, మార్చి 11 : నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ తోపాటు నగరపాలక కమిషనర్ మకరంద్, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

■ **ఆర్మూర్ టీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్ రోగాలకు నిలయంగా మారిందని..**

ఆర్మూర్‌లో ఉన్న టీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్ రోగాలకు నిలయంగా మారిందని నాగరాజు అనే వ్యక్తి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. బాత్‌రూమ్‌లు కంపుకొడుతున్నాయని, పిల్లల డార్మెటరీ రూమ్‌లు, బాత్‌రూమ్‌లు ఒకే భవనంలో ఉండడం వలన అపరిశుభ్రత కారణంగా పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయామై ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా.. దురుసుగా మట్లాడుతున్నాడని ఫిర్యాదు చేశాడు.

■ **బైక్ చోరీపై పోలీసులు పట్టించుకోవడం లేదని..**

ప్రభుత్వ దవాఖాన ఎదుట పార్కింగ్ చేసిన తన బైక్ ఇటీవల పోయిందని, ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించకపోవడంతోనే తన బైక్ దొరకలేదని జిల్లాకేంద్రంలోని సాయినగర్‌కు చెందిన సుధాకర్ అనే వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశాడు. సీసీ టీవీ ఫుటేజీలో బైక్‌ను చోరీ చేస్తున్న దృశ్యాలు రికార్డయినా దొంగలను పట్టుకోలేదని, పోలీసుల నిర్లక్షం పోలీసుల నిర్లక్ష్యంతోనే తన బైక్ దొరకలేదని, తన బైక్‌ను పట్టుకొని, అప్పగించాలని కోరారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు

■ **కూతురిని ఆదుకోవాలని..**

పెండ్లయి కుమారుడు పుట్టిన తర్వాత నరాల సంబంధిత వ్యాధితో తన కూతురు స్రవంతి బాధపడుతున్నదని, ఆదుకోవాలని గాజులపేట్‌కు చెందిన ఆమె తండ్రి దేవారెడ్డి అధికారులకు విన్నవించాడు. ఐదేండ్లుగా మంచానికే పరిమితమైందని, కూలీ పని చేసుకొని బతికే తమకు కనీసం మందులు కొనే పరిస్థితి లేదని విన్నవించాడు. అధికారులు స్పందించి తమ కూతురు ఆరోగ్యం బాగయ్యేలా చూడాలని కోరాడు. తన కూతురిని చేతులపై ఎత్తుకొని రావడం అక్కడ ఉన్న వారిని కలిచివేసింది.

ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా జీవించాలి

■ **బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి**

కోటగిరి, మార్చి 11 : మానవజన్మ చాలా గొప్పదని, ఇతరుల మనస్సు నొప్పించకుండా జీవించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పొతంగల్ మండలం హంగర్గా బీసీ కాలనీలో అఖండ హరినామ సప్తాహం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా.. ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. తల్లిదండ్రులను గౌరవించాలని, వీలైతే ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు శంకర్ పటేల్, ఏఎంసీ మాజీ చైర్మన్ నీరడి గంగాధర్, హంగర్గా మాజీ సర్పంచ్ నీరడి ఉదయ్‌భాస్కర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిరాజ్, శాంతేశ్వర్‌పటేల్, ఎంపీటీసీ ఉమారాంబాబు, సంపత్, జగన్, శివరాజ్, లక్ష్మణ్‌పటేల్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

జాతీయ మహాసభల్లో డాక్టర్ విశాల్



డాక్టర్ విశాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, మార్చి 11 : ఇండియన్ అసోసియేషన్ జెరియాట్రిక్ మెంటల్ హెల్త్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం జాతీయ మహాసభలు నిర్వహించారు. జిల్లాకేంద్రానికి చెందిన మానసిక వైద్యనిపుణుడు విశాల్ హాజరై పలు సూచనలు చేశారు. డాక్టర్ విశాల్‌ను అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గీతా సాహ, ప్రధానకార్యదర్శి డాక్టర్ నీలాంజనపాల్, డాక్టర్ ప్రసాదరావు అభినందించి జ్ఞాపికను అందజేశారు.

కంటి అద్దాలు,వాటర్ బాటిళ్ల అందజేత

సిబ్బందికి కంటి అద్దాలను అందజేస్తున్న సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, మార్చి 11 : ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వేసవికాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా కంటి అద్దాలు, వాటర్ బాటిళ్లను సీపీ కల్మేశ్వర్ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, మోక్ష ఫ్యాషన్ యజమాని గాదె ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఫిల్లింగ్‌స్టేషన్ ప్రారంభం

వినాయక్‌నగర్, మార్చి 11: నిజామాబాద్ నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఫిల్లింగ్ స్టేషన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నడిపే ఈ బంకు ద్వారా వచ్చే లాభాలు పోలీసు కుటుంబాల సంక్షేమానికి వెచ్చించనున్నారని అన్నారు. ప్రైవేటు పెట్రోల్ బంకుల కన్నా ఎక్కువగా ప్రజల విశ్వాసాన్ని పొందుతుందని ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్న సీపీని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఐవోసీ సీజీఎం శుభ్రత్ రత్, ప్రొబేషనరీ ఐపీఎస్ చైతన్యారెడ్డి, సీనియర్ మేనేజర్ మోహన్ కిశోర్, ఏసీపీలు పాల్గొన్నారు.

కారులో పెట్రోల్ పోస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

అధ్యాపకులకు సన్మానం

అధ్యాపకురాలిని సన్మానిస్తున్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి, మార్చి 11 : జీఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎల్లమ్మగుట్టలోని ఓ ఫంక్షన్‌హాలులో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరై ఎస్ఎస్ఆర్ అధ్యాపకులు నాహియా నయాబ్, అనంతుల స్వప్నను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు, పుస్తకాల పంపిణీ

మోర్తాడ్/ నందిపేట్/ వర్ని, మార్చి 11: మోర్తాడ్ మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో సామాజిక విలువలు, నిజాయితీని పెంపొందించే షిరోస్, విజయానికి బాటలు తదితర పుస్తకాలను సోమవారం హెచ్ఎం లక్ష్మీనర్సయ్య విద్యార్థులకు పంపిణీ చేశారు. సుంకం రాములు-ఆండాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు వీటిని అందజేశారని హెచ్ఎం తెలిపారు. ఉపాధ్యాయులు మాణిక్యం, రాములు, విశాల్, శ్యామ్‌చరణ్, సాగరిక, అర్జున్ పాల్గొన్నారు. నందిపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పూర్వవిద్యార్థులు (1989-90 బ్యాచ్) పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు లింగం, మురళీధర్‌గౌడ్, సాయిరాం, మోహన్, గంగారెడ్డి, సంజీవ్, రాజేందర్,భోజాగౌడ్, లక్ష్మీనారాయణ, సుధాకర్, భోజన్న, హన్మాండ్లు పాల్గొన్నారు. వర్ని మండలకేంద్రంలోని మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు వెయ్యి మందికి వీటిని పంపిణీ చేసినట్లు ట్రస్టు సభ్యుడు ఠాగూర్ తెలిపారు.

తొర్లికొండ జడ్పీహెచ్ఎస్‌లో సూపర్ బ్రెయిన్ యోగా

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అందె జీవన్‌రావు

జక్రాన్‌పల్లి, మార్చి11: మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్ఎస్‌లో 'సూపర్ బ్రెయిన్ యోగా' కార్యక్రమాన్ని రాష్ట్ర అవార్డు గ్రహీత, గుంజీళ్ల మాస్టర్‌గా పేరొందిన అందె జీవన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. సూపర్ బ్రెయిన్ యోగా అనేది గుంజీళ్ల మెరుగైన విధానమని, గుంజీళ్లు తీసే పద్ధతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

మారుతీ మందిరం వద్ద పోలీస్ పికెట్

శక్కర్‌నగర్, మార్చి 11: బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలోని నంది, శివలింగం విగ్రహాలను సోమవారం బయట ఉంచడం వివాదానికి దారితీసింది. ఈ విషయంపై అర్చకుడిని వార్డు కౌన్సిలర్‌తోపాటు పలువురు నిలదీశారు. విగ్రహాలను నదిలో నిమజ్జనం చేసేందుకు బయటఉంచామని అర్చకుడు చెప్పగా, మలమూత్ర విసర్జనలు చేసే ప్రదేశంలో విగ్రహాలను పారవేసి, మనోభావాలను దెబ్బతీశారంటూ కొందరు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకోగా.. విగ్రహాలను ఆలయంలో ఉంచేందుకు పోలీసులు ఏర్పాట్లు చేయించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆలయం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు : ఒకరి డిబార్

ఖలీల్‌వాడి, మార్చి 11 : ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఫస్టియర్ విద్యార్థులకు సోమవారం అర్థశాస్త్రం, భౌతికశాస్త్రం పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 841 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో రఘురాజ్ తెలిపారు. నవీపేట్ మోడల్ కళాశాలలో ఓ విద్యార్థిని మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతుండగా డిబార్ చేసినట్లు వెల్లడించారు.

సిరికొండ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2011 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ విద్యార్థి దశలోని జ్ఞాపకాలను నెమరువేసుకొని, ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. - సిరికొండ, మార్చి 11

చలివేంద్రం ప్రారంభం

కమ్మర్‌పల్లి, మార్చి 6 : మండలంలోని నర్సాపూర్ గ్రామం లో శ్రీలక్ష్మీ నర్సింహ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వేసవికాలంలో ప్రజల దాహాన్ని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండ ప్రభాకర్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు

బాల్కొండ, మార్చి 11: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పీఆర్‌సీ ఫిట్‌మెంట్ ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు సోమవారం మండల కేంద్రంలో సంబురాలు చేసుకొన్నారు. మిఠాయిలు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

ఆర్మూర్ టౌన్, మార్చి 11 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తాత్కాలిక ఇన్‌చార్జి వైస్ చైర్మన్ షేక్ మున్నా అధ్యక్షతన సోమవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మున్సిపల్ సొంత నిధులు 12.47 కోట్లు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులు (క్యాపిటల్ గ్రాంట్) 6.33 కోట్లు, డిపాజిట్లు రూ.25 లక్షలు కలిపి మొత్తం 19.06 కోట్లు ఉన్నట్లు కమిషనర్ రాజు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులకు భూమి పూజ

ముప్కాల్, మార్చి 11: మండల కేంద్రంలో చైతన్య యువజన సంఘం (తెలంగాణ క్రీడా ప్రాంగణం)లో క్రీడాకారుల రాకపోకల సౌకర్యార్థం రూ. 1.50 లక్షలతో చేపట్టనున్న కల్వర్టు పనులకు ఎంపీటీసీ పద్మా కిషన్ సోమవారం భూమి పూజ చేశారు. ఎంపీపీ సామ పద్మా వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బద్దం నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలను పరిశీలించిన జేడీఏ

రెంజల్, మార్చి 11: మండలంలోని బాగేపల్లి గ్రామంలో రైతులు సాగుచేసిన వరి పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్‌హుస్సేన్ సోమవారం పరిశీలించారు. వరి పంట పొట్ట దశలో ఉందని, ఎండ తీవ్రతకు బోర్లు ఎత్తిపోతున్నాయని, బాగేపల్లి చెరువు నింపి తమ పంటలను కాపాడాలని ఆయనకు రైతులు విన్నవించారు. రైతుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వాజిద్ హుస్సేన్ తెలిపారు. ఏవో లక్ష్మీ కాంత్‌రెడ్డి, ఏఈవో కవిత, రైతు నాయకులు సురేందర్‌గౌడ్, సుదర్శన్, శంకర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

బాగేపల్లిలో పంటలను పరిశీలిస్తున్న జేడీఏ వాజిద్ హుస్సేన్

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

వర్ని/ డిచ్‌పల్లి/ కమ్మర్‌పల్లి, మార్చి11 : వర్ని మండలంలోని జలాల్‌పూర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ వీర్రాజు సోమవారం ప్రారంభించారు. కొత్త గుడిసెల వద్ద రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ అనితావెంకాగౌడ్, సహకార సంఘం అధ్యక్షుడు బర్దావల్ దశరథ్, నాయకులు పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు, వీడీసీ సభ్యులు సోమవారం ప్రారంభించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేసినట్లు నాయకులు తెలిపారు. కమ్మర్‌పల్లి మండలంలోని హాసాకొత్తూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్పెషల్ ఆఫీసర్ ఆంధ్రయ్య, ఎంపీటీసీ నోముల రజితా నరేందర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో గంగమ్మ ఆలయం వద్ద పనులను ప్రారంభించారు.

డీజీబీలో చోరీకి యత్నం

సైరన్ మోగడంతో పరారైన దుండగులు

ఆర్మూర్‌టౌన్, మార్చి11: మండలంలోని పిప్రి గ్రామంలో దక్కన్ గ్రామీణ బ్యాంకులో ఇద్దరు దుండగులు చోరీకి యత్నించగా.. సైరన్ మోగడంతో పరారయ్యారు. ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు దుండగులు బ్యాంకు కిటికీని తొలగించి లోనికి ప్రవేశించారు. లాకర్ ధ్వంసం చేసేందుకు యత్నించగా సైరన్ మోగడంతో అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

శాంతియుతంగా పండుగ జరుపుకోవాలి

బోధన్ ఏసీపీ శ్రీనివాస్

శక్కర్‌నగర్,/రెంజల్, మార్చి 11: ఈనెల 12నుంచి ప్రారంభమయ్యే రంజాన్ మాసం సందర్భంగా ప్రతిఒక్కరూ పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. సోమవారం బోధన్‌పోలీస్ స్టేషన్‌తోపాటు రెంజల్‌లోని రైతు వేదికలో మసీదు కమిటీల ప్రతినిధులు, మతపెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పట్టణ సీఐ వీరయ్య, బోధన్ రూరల్ సీఐ నరేశ్‌కుమార్, ఏఎస్సై రవీందర్, ఆయా గ్రామాల మత పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★అక్వా అక్షర పవన్ ఎంటర్‌ప్రైజెస్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. Age 18-45 Years, సాలరీ మార్కెటింగ్ స్కిల్స్ బట్టి 10K- 40K వరకు ఉంటుంది. Only 6 hours time ✆ 9121825513

NTZ-324729

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెర్కిట్ సొసైటీ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

ఆర్మూర్‌టౌన్, మార్చి11:ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ చైర్మన్ పెంటా భోజా రెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. వింజో కార్యాలయంలో సోమవారం డీసీవో శ్రీనివాస్ రావు సమక్షంలో బల నిరూపణ చేపట్టగా.. అవిశ్వాసం నెగ్గడానికి 9 మంది డైరెక్టర్లు కావాల్సి ఉండగా 8 మంది మాత్రమే హాజరయ్యారు.దీంతో చైర్మన్‌పై అవిశ్వాసం వీగిపోయినట్లు డీసీవో ప్రకటించారు.

జైతాపూర్‌లో ఒకరి ఆత్మహత్య

ఎడపల్లి, మార్చి 11 : మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన మాతంగి సాయిలు (55) చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రం సోమవారం తెలిపారు. కూలిపని చేసుకొని జీవిస్తున్న సాయిలు కొంతకాలంగా ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా బాగోలేడని, దీంతో గ్రామంలోని పార్కులో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడి భార్య గంగామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నందిపేటలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు బాలయోగి శ్రీరాములు మహరాజ్ ఆశ్రమం నుంచి పండరిపూర్ వరకు సోమవారం మహా పాదయాత్ర చేపట్టారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 500 మంది భక్తులతో పాదయాత్రను ప్రారంభించారు. -నందిపేట్, మార్చి 11

గడ్డిమందు తాగిన యువకులు

ఒకరి మృతి, దవాఖానలో చికిత్స పొందుతున్న మరొకరు

భీమ్‌గల్, మార్చి 11: అద్దెకు తీసుకున్న కారుకు కిరాయి కట్టలేక మండల కేంద్రానికి చెందిన కమ్మరి నరేశ్(32) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా.. మరో యువకుడు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. రెండు నెలల క్రితం నరేశ్ అనే యువకుడు సూర సుధాకర్ నుంచి కారును కిరాయికి తీసుకొని నడిపించుకుంటున్నాడు. కిరాయి ఖర్చు, మరమ్మతులకు రూ.లక్ష కట్టాలంటూ ఒత్తిడి రావడంతో నరేశ్ గడ్డిమందుతాగాడు. మధ్యవర్తిగా ఉన్న నరేశ్ స్నేహితుడు లక్ష్మణ్ కూడా గడ్డి మందుతాగాడు. నరేశ్ మృతిచెందగా.. లక్ష్మణ్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. తన భర్త మృతికి సూర సుధాకర్, రజనీశ్ చేసిన ఒత్తిడే కారణమని ఆరోపిస్తూ మృతుడి భార్య ప్రమీల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **నేడు మోస్రా మండల సర్వసభ్య సమావేశం -** మోస్రా (చందూర్), మార్చి 11 : మోస్రా మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు (మంగళవారం) ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.
- **తాగునీటి ఎద